ఇరిగేషన్ నీళ్లతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నీటిపారుదల శాఖతో ఏం లాభం?

- లక్షల ఎకరాలు ఎండిపోయాక నీళ్లిస్తరా?
- నీటిపారుదల అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం
- పనుల ఆలస్యంపై వివరణ ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం
- ఖమ్మం జిల్లా పాలేరులో సాగర్ కాల్వ మరమ్మతు పనుల పరిశీలన

కూసుమంచి, సెప్టెంబర్ 23: 'వరదల కారణంగా దెబ్బతిన్న సాగర్ కాల్వల పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? 20 రోజులు దాటినా ఇంకా ఎన్ని రోజులు చేస్తరు? నీటిపారుదల శాఖ ఉండి ప్రయోజనం ఏమిటి? జిల్లాలో లక్షలాది ఎకరాల పంట ఎండిపోయిన తర్వాత నీరిచ్చి ఏం లాభం?' అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇరిగేషన్ అధికారులు, కాల్వ మరమ్మతు పనులు చేస్తున్న కాంట్రాక్టరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ మంత్రి టీ హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ఖమ్మం జిల్లా పాలేరు కాల్వకు మరమ్మతులు చేపట్టకపోవడంపై విలేకరుల సమావేశం నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేసిన కొద్ది సమయంలోనే మంత్రి తుమ్మల స్పందించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం గమనార్హం.

హరీశ్‌రావు ఎఫెక్ట్

ఆలస్యానికి కారణమెవరు?

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో గండిపడిన సాగర్ కాల్వ మరమ్మతులు పూర్తి చేసి ట్రయల్ రన్ వేయగా.. మళ్లీ యాటీ మధ్యలో వాల్ క్రాక్ ఇచ్చి కూలిపోవడంతో శనివారం నుంచి మరమ్మతు పనులు చేపట్టారు. పనులు ఆలస్యమవుతుండడంతో ఆయకట్టు పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లోని పొలాలకు నీరందకపోవడంతో మంత్రి తుమ్మల మండిపడ్డారు. పనుల ఆలస్యానికి ఎవరు కారణమో తెలుసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న మంత్రి తుమ్మల పాలేరు కాల్వ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గండిపడిన తర్వాత మరమ్మతు చేసి ట్రయల్ రన్ వేసే క్రమంలో మళ్లీ వాల్ కూలిన తీరును మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్‌తో మంత్రి మాట్లాడుతూ.. 'మీ డిపార్ట్‌మెంట్ ఎందుకు ఉంది? రైతుల పంటలకు నీరు అవసరం ఉన్న సమయంలో ఇవ్వకుండా.. మీరంతా ఎందుకు? అసలు మీ ప్లాన్ ఏమిటి?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో ఆలస్యం ఎందుకు అవుతున్నదని కాంట్రాక్టర్ ముత్తయ్యను ప్రశ్నించారు. ఇంతమంది ఉండి.. కాల్వ వాల్ బలహీనంగా ఉన్నప్పుడు గుర్తించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు రైతులకు సాగునీరు లేకపోవడంతో 20 రోజులుగా నానా ఇబ్బందులు పడుతున్నారని, మీరంతా ఉండి ఏం చేస్తున్నట్టని మంత్రి ప్రశ్నించారు. రెండో సారి జరిగిన కాల్వ లీకేజ్‌ను ఆరా తీశారు. ఎప్పటి వరకు నీరు ఇస్తారు? యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి వచ్చిన రోజు కాల్వను మూసివేసి పనులు చేయమని చెప్పాం. కానీ ప్రయోజనం లేదని అన్నారు. అధికారుల సమన్వయ లోపం వల్లే పనుల్లో జాప్యం జరుగుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, నీఈ విద్యాసాగర్, గుత్తేదారు ముత్తయ్య, ఈఈలు వెంకటేశ్వర్లు, ఏసీపీ తిరుపతిరెడ్డి, అనన్య, డీఈలు, నాయకులు రవికుమార్, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేశ్, వీర భద్రం, ఉపేందర్, మోహన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నీళ్లున్నా ఎండబెట్టారు!

రైతుభరోసా ఇవ్వరు.. పూర్తి రుణమాఫీ చేయరు.. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వరు.. జానెడు గండిని పూడ్చలేరు.. మిగిలిన పంటలకు కనీసం సాగునీళ్లు ఇవ్వరు.. ఇంకెందుకు మీరు అధికారంలో ఉండి? 22 రోజులుగా నిద్రపోతున్నారా? ఇదేనా రైతు ప్రభుత్వం అంటే..? -హరీశ్‌రావు

- 22 రోజులైనా కాలువ గండిని పూడ్చలేరా?
- కూల్చివేతలేనా?పూడ్చివేతలు రావా?
- రైతుల కన్నీళ్లు కనిపించడంలేదా?
- ముగ్గురు మంత్రులున్నా ఏం లాభం?
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా పాలాలకు నీళ్లెందుకివ్వరు?
- ఎండిన పాలాలకూ ఎకరాకు 25 వేలు పరిహారం ఇవ్వాలి
- వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పైసా ఇవ్వలేదు
- త్వరలో ఖమ్మంలో బీఆర్ఎస్ పర్యటన : హరీశ్‌రావు

> దేవుడా, రామచంద్రస్వామీ..! ఈ ముఖ్యమంత్రిని క్షమించు.. రైతులను రక్షించు.. కాలువ నీళ్లు ఎప్పుడైతదో తెలుస్తలేదు.. ఖమ్మం జిల్లా మీద మంచి వర్షాలు పడి పంటలను కాపాడే విధంగా రైతులను దీవించి, రైతులను రక్షించు..! -హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా నాగార్జునసాగర్ నిండుగా నీళ్లున్నా కడమ కాలువ పరిధిలోని ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువకు పడిన గండిని 22 రోజులైనా పూడ్చడం చేతగాని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. వానలు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలతోపాటు సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు కూడా ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా ఏం లాభం? జానెడు గండిని పూడ్చలేక 22 రోజులుగా నిద్రపోతున్నారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా నుంచి తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే.. రెండున్నర లక్షల ఎకరాల పంటలు ఎండబెడతారా? అని మండిపడ్డారు. ఖమ్మం రైతులు కన్నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయ లోపం, నీటిపారుదల శాఖ మంత్రి నిర్లక్ష్యం, ముఖ్యమంత్రి పట్టింపు లేకపోవడం వల్ల ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో పంటలు ఎండిపోతున్నా, రైతులు ధర్నాలు చేస్తున్నా.. ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్నదని విమర్శించారు. జిల్లాలో గత సంవత్సరం ప్రకృతి తెచ్చిన కరువు రాగా, ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనం వల్ల కరువు వచ్చిందని మండపడ్డారు. ఖమ్మం జిల్లాలో ఒకవైపు వరదల వల్ల, మరోవైపు సాగర్ ఆయకట్టుకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని వివరించారు. 'ముందు దగా, వెనక దగా, కుడి ఎడమల దగా, కాంగ్రెస్ పాలనలో రైతు గుండె మంట భగ భగ' అన్నట్టుగా పరిస్థితి ఉన్నదని చెప్పారు. గండి పూడ్చడానికి సీనియర్ ఇంజినీర్లను పెట్టి ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రింబవళ్లు పనిచేయించవచ్చని సూచించారు. కాలువ గండిని పూడ్చలేని ప్రబుద్ధులు, గతంలో కాళేశ్వరం గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లారని ఎద్దేవా చేశారు.

కూల్చివేతలు తప్ప పూడ్చివేతలు రావు

కాంగ్రెస్ సర్కారుకు కూల్చివేతలు తప్ప పూడ్చివేతలు రావు అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టడం మీ ప్రాధాన్యమా? రైతులకు నీరు ఇవ్వడం రాదా? కాంగ్రెస్‌కు రైతుల పట్ల జాలి, దయ లేవా? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను తిట్టడంలో పోటీపడుతున్న మంత్రులు నీళ్లు ఇవ్వడంలో పోటీ పడలేరా? అని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయ లోపం, నీటిపారుదల శాఖ మంత్రి నిర్లక్ష్యం, ముఖ్యమంత్రి పట్టింపు లేకపోవడం వల్ల ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. ఒక మంత్రి అమెరికాలో ఉన్నారని, ఇంకో మంత్రి బీఆర్ఎస్‌ను తిట్టే పనిలో బిజీగా ఉన్నారని, ఇంకో మంత్రి వరదల్లో కొట్టుకుపోయిన పంటలకు నయాపైసా సాయం చేయలేకపోయారని పేర్కొన్నారు.

ఎకరాకు 25 వేలు ఇవ్వాలి

పంట నష్ట పరిహారం కింద ఎకరాకు రూ.25 వేల చొప్పున అందజేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని హరీశ్‌రావు తెలిపారు. గతంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా రూ.25 వేల నష్టపరిహారాన్ని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఇప్పటివరకు పంట నష్టపోయిన ఒక్క రైతుకు కూడా సాయం చేయలేదని, తక్షణమే సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ నీరు ఇచ్చినా పంటలు చేతికొచ్చే పరిస్థితులు లేవని ఆందోళన వ్యక్తంచేశారు. సాగర్ ఆయకట్టు కింద నీళ్లు అందక ఎండిపోయిన పంటలను సర్వే చేసి వారికి కూడా ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వరదల వల్ల 60 వేల ఎకరాలు, కాంగ్రెస్ నిర్వాకం వల్ల లక్ష ఎకరాలకుపైగా నష్టపోయిందని ప్రాథమికంగా అంచనా వేశామని చెప్పారు.

సీతారామ ఏమాయె...?

ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు 70 రోజుల్లో ప్రాజెక్టును పూర్తిచేశామంటూ గొప్పలు చెప్పుకున్నారని, మరి ఈ ప్రాజెక్టు ద్వారా దిగువన ఉన్న వైరా రిజర్వాయర్‌ను నింపి, దాని పరిధిలో 1.70 లక్షల ఎకరాలకు నీరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సీతారామస్వామి మీద ఒట్టు పెట్టి.. మాట తప్పారని, దేవున్ని కూడా మోసం చేశారని మండిపడ్డారు.

ఫిరాయింపులపై ఇంకా బుకాయింపులా?

అబద్ధం అతికేటట్టు ఉండాలన్న విషయాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలుసుకోవాలని, ఫిరాయింపులపై ఆయన అతి తెలివితేటలు ప్రదర్శిస్తున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలవాలనుకుంటే అధికారిక కార్యక్రమాల్లో కలుస్తారని, పార్టీ మీటింగ్‌లో కాదనే విషయాన్ని శ్రీధర్‌బాబు గ్రహించాలని చెప్పారు. సొంత నియోజకవర్గానికి సీఎం వచ్చారనే ఉద్దేశంతో అరికెపూడి గాంధీ కలిసిందే నిజమైతే, మరి ప్రకాశ్‌గౌడ్, కడియం శ్రీహరి ఎందుకొచ్చారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలను ఖూని చేస్తూ నగ్నంగా బయటపడ్డారని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

మరోసారి ఖమ్మం పర్యటన

ఖమ్మ జిల్లా రైతులు ఏం పాపం చేశారు? తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించడం వాళ్ల పాపమా? జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటమే శాపమా? ఖమ్మం జిల్లా రైతులు చేసిన తప్పేమిటి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాజకీయ జీవితం ఇచ్చిన ఖమ్మం జిల్లా ప్రజలకు మీరు ఇచ్చే బహుమానం ఇదేనా? వరదల్లో కొట్టుకుపోయిన ఇండ్లకు నష్ట పరిహారం ఇవ్వరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున త్వరలో మరోసారి ఖమ్మం జిల్లాకు వెళ్తామని, రైతులకు మనోధైర్యం ఇస్తామని చెప్పారు. నీళ్లు లేక రైతులు ట్యాంకర్లు, జనరేటర్లు పెట్టుకొని పంటలు తడుపుకొంటున్నారని చెప్పారు. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తే తమపై దాడులు చేశారని, ఇప్పటివరకు దాడి చేసిన వారిపై కేసు పెట్టలేదని చెప్పారు. తాము దాడులకు భయపడేది లేదని హెచ్చరించారు.

సార్.. దవాఖానల్లో మందుల్లేవు!

- టీజీఎంఎస్ఐడీసీ ఎండీకి ఫార్మాసిస్టుల స్పష్టం
- అక్టోబర్ 15 నాటికి తెప్పిస్తామన్న ఎండీ
- కొరతను కప్పిపుచ్చేందుకు ప్రభుత్వ యత్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత తీవ్రంగా ఉన్నదని ఫార్మాసిస్టులు టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ బోర్కడేకు స్పష్టంచేశారు. దవాఖానల్లో మందుల కొరతపై ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం ఆయన ఫార్మసిస్టులను హైదరాబాద్‌కు పిలిపించుకొని చర్చించారు. ఈ సందర్భంగా దవాఖానల్లో ఏయే మందులు, సర్జికల్స్ లేవో వారు వివరించారు. ఈ సందర్భంగా ఎండీ స్పందిస్తూ.. కొన్ని మందుల ఆర్డర్ పెండింగ్‌లో, మరికొన్ని సరఫరా దశలో ఉన్నాయని, ఇంకొన్ని నాణ్యత పరీక్షలకు పంపామని వివరించినట్టు తెలిసింది. అత్యవసర మందులు, సర్జికల్స్ జాబితాను రూపొందించామని, వీటిని అక్టోబర్ 15 నాటికి సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎండీ వారితో చెప్పినట్టు సమాచారం.

నివేదిక ఎందుకిచ్చారని ఆగ్రహం..

ఇటీవల కామారెడ్డి జిల్లాలో కలెక్టర్ దవాఖానను సందర్శించగా అధికారులు మందుల కొరతను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. అందుబాటులోలేని మందుల జాబితా ఇవ్వాలని సూచించా రు. ఫార్మసిస్టు జాబితాను కలెక్టర్‌కు అం దించగా, టీజీఎంఎస్ఐడీసీ ఉన్నతాధికారులు సదరు ఫార్మసిస్టుపై ఆగ్రహం వ్యక్తం చేశారట. మరోవైపు ఈ అంశంపై డీఎంఈ ప్రత్యేక విచారణ చేపట్టారు. సోమవారం ఓ అధికారిని కామారెడ్డి జిల్లా దవాఖానకు పంపి విచారణ జరిపించారు.

ఎంతైనా కష్టపడండి.. నీళ్లివ్వండి

- పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- రేయింబవళ్లు పనులు కొనసాగాలి
- పని ప్రదేశంలో లైటింగ్ లేకపోవడంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- పాలేరు కాల్వ పనుల పరిశీలన

పాలేరు కాల్వ వద్ద పనులను సోమవారం రాత్రి పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హరీశ్‌రావు ఎఫెక్ట్

కూసుమంచి, సెప్టెంబర్ 23: పాలేరు కాల్వ మరమ్మతులో నిర్లక్ష్యం పనికిరాదని, యుద్ధ ప్రాతిపదికన రేయింబవళ్లు పనిచేసి సాధ్యమైనంత త్వరగా సాగుభూములకు నీరందించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ఖమ్మం జిల్లా పాలేరు కాల్వ మరమ్మతులు చేపట్టకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విలేకరుల సమావేశం నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేసిన సాయంత్రమే మంత్రి పొంగులేటి స్పందించి, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం గమనార్హం. సోమవారం రాత్రి పాలేరు కాల్వకు పడిన గండి ప్రాంతాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి అధికారులతో మాట్లాడారు. 'జిల్లాలో రైతుల సాగు భూములకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి విడుదలలో ఆలస్యం కావొద్దు.. మీరు ఎంత కష్టపడతారో తెలియదు. కానీ.. నీరు మాత్రం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మళ్లీ అర్ధరాత్రి ఇక్కడికి వస్తాను' అని అధికారులకు తెలిపారు. పని ప్రదేశంలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఆర్డీవో గణేశ్, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగ రావు, ఈఈ అనన్య, డీఈ మధు, కాంట్రాక్టర్ ముత్తయ్య, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి హైదరాబాద్‌లో

'స్పేస్‌టూన్'

ప్రారంభించనున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తేతెలంగాణ): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు 'స్పేస్‌టూన్' పేరిట స్పేస్ థీమ్ కార్టూన్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ప్రారంభించనున్నట్టు హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ చైర్మన్ శంకర్, కార్యదర్శి మృత్యుంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

రేపు ఆలయాల ఉద్యోగుల భేటీ

వేములవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం

వేములవాడ, సెప్టెంబర్ 23: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఆలయాల ఉద్యోగుల జేఏసీ పునర్నిర్మాణ దిశగా అడుగులు వేస్తున్నది. ఇటీవల దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీలు, జరిగిన పరిణామాల నేపథ్యంలో ఉద్యమ కాలంలోని జేఏసీ మళ్లీ ఇప్పుడు పునర్నిర్మాణానికి నాంది పలికింది. ఇందులో భాగంగా.. ఆలయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం ఈ నెల 25న బుధవారం వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో జరగనున్నది. రాష్ట్రంలోని వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, బాసర, కొమురవెల్లి ఆలయాల అర్చక ఉద్యోగులు, జేఏసీ నాయకులు సుమారు 200 మంది వరకు హాజరుకానున్నారు. దీనికి టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌తోపాటు ఆలయాలు ఉన్న అన్ని జిల్లాల్లోని టీఎన్జీవో నాయకులు హాజరు కానున్నట్టు జేఏసీ వర్గాలు వెల్లడించాయి. దాదాపు 25 అంశాల ఎజెండాతో రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం జరగనున్నది. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర దేవాలయాల జేఏసీ చైర్మన్ రమేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్‌ను అంతం చేయటం.. కోమటిరెడ్డి జేజమ్మ తరం కాదు

- ముందు నీ కుటుంబ సమస్యలు చూసుకో
- మాటలు ఆపి హామీలు అమలు చేయండి
- భువనగిరి జిల్లాకు సాగు నీళ్లు ఇప్పించండి
- కోమటిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): 'బీఆర్ఎస్‌ను అంతం చేయడం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాదు కదా.. ఆయన జేజమ్మ తరం కూడా కాదు' అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఇవన్నీ పక్కనబెట్టి కోమటిరెడ్డి తన కుటుంబంలో అంతర్గత సమస్యలపై దృష్టి పెట్టాలని చురక అంటించారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె.. అసలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితపై మాట్లాడే అర్హత కోమటిరెడ్డికి లేదని అన్నారు. హరీశ్, కేటీఆర్ వద్దంటే పోలీస్ అధికారి ప్రభాకర్‌రావు భారత్‌కు రావటం లేదని అంటున్నారని.. వారి తర్వాత రేవంత్ కూడా అమెరికా వెళ్లారని, మరి ప్రభాకర్‌రావుకు సీఎం ఏం చెప్పి వచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఉంటూ మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా ఉన్న తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి ఓటు వేయాలని చెప్పిన చరిత్ర వెంకట్‌రెడ్డిది అని దుయ్యబట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మంత్రిగా కోమటిరెడ్డి చేసింది శూన్యం అని.. తపాస్‌పల్లి నుంచి నీళ్లు తెస్తానన్న హామీ ఏమైందని నిలదీశారు. రిజర్వాయర్ల నుంచి జిల్లా చెరువులు నింపే అవకాశమున్నా ఆ పని ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. 'గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తి చేయకుండా ఏం చేస్తున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని పోచంపల్లి నుంచి రంగారెడ్డి జిల్లాకు రేవంత్‌రెడ్డి తరలిస్తే కోమటిరెడ్డి ఏం చేస్తున్నారు? జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై కోమటిరెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు? యాదాద్రికి మంజూరైన మెడికల్ కాలేజీని గతంలో కేటాయించిన ప్రదేశంలోనే ఉంచేలా కోమటిరెడ్డి ఎందుకు ప్రయత్నించటం లేదు? మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్య తగ్గిస్తుంటే ఏం చేస్తున్నారు?' అని ఎండగట్టారు. వేరే విషయాలు తగ్గించి జిల్లా విషయాలను సీఎంతో కోమటిరెడ్డి చర్చిస్తే బాగుంటుందని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

నిజ నిర్ధారణపై నిర్బంధం

మొదటిపేజీ తరువాయి...

హౌస్ అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను ఇంటి నుంచి బయటికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో గాంధీ దవాఖాన వద్ద భారీగా పోలీసులు మోహరించారు.గాంధీలో మరణాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సోమవారం గాంధీ దవాఖానను పరిశీలించాలని నిర్ణయించింది.ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి గాంధీ దవాఖానకు బయలుదేరగానే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కూడా ఇంటి నుంచి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.చాకచక్యంగా తప్పించుకున్న సంజయ్, ఆనంద్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి గాంధీకి బయలుదేరారు. పోలీసులు వీళ్లు వెళ్లే మార్గాన్ని నిర్బంధించారు. ఎలాగో అలా గాంధీకి చేరుకున్న ఈ ముగ్గురూ లోపలికి వెళ్దామనుకుంటే పోలీసులు అడ్డుకున్నారు. తాము డాక్టర్లమని సంజయ్, మెతుకు ఆనంద్ చెప్పినా పట్టించుకోలేదు. ఇదే సమయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ గాంధీకి బయలుదేరగా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కూడా గాంధీకి రాకుండా పోలీసులను మోహరించారు. తాటికొండ రాజయ్య తన అనుచరులతో ఇంటి బయటకు రాగా పోలీసులు అదుపులోకి తీసుకొని నగరమంతా తిప్పారు. తర్వాత బొల్లారం పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి మధ్యాహ్నం తీసుకువచ్చి తెలంగాణభవన్ వద్ద వదిలిపెట్టారు. ఇదే సమయంలో గాంధీ దవాఖాన వద్ద సంజయ్, మెతుకు ఆనంద్, మాగంటి గోపీనాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని హిమాయత్‌నగర్, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో తిప్పి చివరకు తెలంగాణ భవన్ వద్ద వదిలిపెట్టారు.జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కూడా హైదరాబాద్‌లో పోలీసులు హౌస్‌అరెస్టు చేశారు.

గాంధీ దవాఖాన వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను అడ్డుకుని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గాంధీకి వెళ్లడం నేరమా?

కేసీఆర్ హయాంలో వైద్యంలో తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచింది. ఇప్పుడు మాతా శిశుమరణాలు, విష జ్వరాలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం సరిగ్గా స్పందించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. మందుల కొరత తీవ్రంగా ఉన్నది. గాంధీ ఆస్పత్రికి తాము వెళితే నేరమా..? ఇది ప్రజా పాలనా..? ఎమర్జెన్సీ పాలనా?

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

ప్రభుత్వమే మంచం పట్టింది

> గాంధీ దవాఖానలో శిశు మరణాలు ఎందుకు పెరిగాయో తెలుసుకోవడానికి వెళ్లాం. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. అయినా సీఎం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వమే మంచం పట్టింది అన్నట్టు ఉన్నది పరిస్థితి.

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

అంత నిర్బంధం ఎందుకు

> కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీ తెచ్చారు. కేసీఆర్ హయాంలో మాతా శిశుమరణాలు దాదాపుగా లేవు